ఆంధ్ర సచిత్ర వారపత్రిక: 27-7-1984

# కూతురు

"కుర్రాడు కలిశాడా?" మహాలక్ష్మి మెట్లెక్కుతున్న భర్త సీతారామయ్యకు ఎదురెళ్లి అడిగింది!

సీతారామయ్య, కుర్చీలో చతికిలబడి, మొహాన పట్టిన చమట తుడుచుకుని, "మంచి నీళ్ళు తీసుకురా!!" అన్నాడు.

రెండు అంగల్లో మహాలక్ష్మి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. గడప నానుకుని నిల్చుంది, భర్త చెప్పబోయే విశేషాలు విందామని.

"కుర్రాడు ఎలా వున్నాడు?"

"కుర్రాడికేం బాగానే వున్నాడు!"

"ఎప్పుడొస్తానన్నాడు?"

సీతారామయ్య క్షణం మాట్లాడలేదు. ఆయన మౌనం మహాలక్ష్మికి ఆతురత కలుగ చేసింది.

"అన్నీ వివరంగా చెప్పండి!" అంది.

"ముందు అన్నం పెట్టు!"

సీతారామయ్య అన్నం తిని, మంచం మీద నడుం వాల్చి చుట్ట కాల్చుకునేలోపల, మహాలక్ష్మి చకా చకా తనూ అన్నం తిని, వంటిల్లు కడుక్కొని వచ్చి, భర్త మంచం ప్రక్కన చాప పరుచుకు కూర్చుండి పోయింది.

"అబ్బాయి నిక్షేపంలా వున్నాడు. వెనకా ముందూ ఎవ్వరూ లేరు. అమలాపురం దగ్గర ఓ పెంకుటిల్లు మాత్రం వుంది - అంతే ఆస్తి. మిలటరీ ఎక్కౌంట్సులో ఉద్యోగం పదేళ్ళ బట్టీ. ఇంతకుముందు జబల్‌పూర్‌లో పనిచేసి యిక్కడకు నాలుగు నెలల క్రితం వచ్చాడు."

మహాలక్ష్మికి ఈ సంబంధం కుదిరితే బావుండు అని అనిపించింది. వెంటనే ఏడు కొండల వాడికి మనసులోనే మ్రొక్కుకుంది. 'రాధ పెళ్ళి అయితే, దంపతులొచ్చి దర్శనం చేసుకుంటా'మని!

"కట్నం అదీ..."

"అంతదాకా పోలేదు!"

"ఏం?.. అన్నీ తేల్చుకువస్తే పొయ్యేదిగా?"

సీతారామయ్య లేచి కూర్చున్నాడు.

"అదే ఆఫీసులో.. బ్రహ్మానందం అని ఓ కుర్రాడు వున్నాడు. అతను కొద్దిగా తెలుసులే నాకు! వస్తుంటే పలకరించి, 'మీ అమ్మాయిని శంకరానికి యిద్దామనా మాష్టారూ' అని అడిగాడు. అవునన్నా. అతనో క్షణం ఆలోచించి, 'కుర్రాడు పైకి బాగానే వున్నాడు. పెళ్ళంటే చాలా జాగ్రత్తగా ఉండాలి. వెనకా ముందూ ఆలోచించి దిగండి!' అని సలహా ఇచ్చాడు!"

"ఏం కుర్రాడి కేమన్నా చెడు అలవాట్లున్నయ్యా!"

"బ్రహ్మానందం యిదీ అని చెప్పలా తేల్చి!"

"అసలు విషయమేమిటండీ?"

"పెళ్ళికొడుకు నాకు బాగా నచ్చాడు. దురలవాట్లేమీ కూడా లేవుట. కట్నం అదీ పట్టింపులేమీ లేవన్నాడు. మీ యిష్టం మీకు పూర్తిగా నచ్చితే దిగండి! అనన్నాడు!"

మహాలక్ష్మికీ ఏం పాలుపోలా - "మరేం చేద్దామని?"

"అదే ఆలోచిస్తున్నా!"

సీతారామయ్యకు తొలి సంతానం ఆడపిల్ల. పెళ్ళయి అత్తారింటి కెళ్ళింది. ఆ తర్వాత ముగ్గురు మొగపిల్లలు. చదువుకుని, రెక్కల కష్టం మీద తలా ఒకచోట బ్రతుకుతున్నారు. బాదర బందీలు అయిపోయాయి అనుకుంటుండగా, మళ్ళీ పదేళ్ళ తర్వాత ఆడపిల్ల పుట్టింది, ఆ రోజుల్లో నిరోధ్‌లు, ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు లేవు. పదేళ్ళ తర్వాత బారసాల పీటల మీద కూర్చోడం, సీతారామయ్యకు మహాలక్ష్మికి కొంత ఇబ్బంది, సిగ్గు కలుగచేసింది. అయితే పెద్ద పిల్ల, కొడుకులు ధైర్యం ఇచ్చారు.

"దాని అదృష్టమెలా వుందో! అయినా మేమంతా లేమూ! ముద్దుల చెల్లెలు అదేగా! దాని అచ్చటా ముచ్చటా, పెళ్ళి పేరంటం, చదువు, మేమూ బాధ్యతలు పంచుకుంటాం" అని ఉత్సాహం, ధైర్యం ఇచ్చారు.

ఆ విధంగా రాధ గారాబంగా పెరిగింది. పుట్టినప్పుడు అర్భకంగా వున్నా, రాను రాను వళ్ళు చేసి, పుష్పవతి అయ్యాక మరీ సోయగం, అందం వచ్చి రాధ అందగత్తె అనిపించుకుంది. కాకపోతే చదువబ్బలేదు. అందుకు తల్లి గారాబం, అన్నల అనురాగం కారణం. పదో తరగతి ప్యాసయింది.

అప్పట్నుంచీ పెళ్ళి ప్రయత్నాలు చేస్తుంటే, ఒక్కటీ సంతృప్తికరంగా, పెళ్ళి సంబంధం దొరకలేదు.

ఆ సాయంత్రం సీతారామయ్యగారు, బ్రహ్మానందం ఇల్లు వెతుక్కుని వెళ్ళాడు. సమయానికి బ్రహ్మానందం ఇంట్లోనే వున్నాడు. సీతారామయ్యగారిని మర్యాద చేసి కూర్చోబెట్టి, "మేష్టారూ కుర్రవాడు మేడిపండు - చూడగానే పిల్లనిద్దామనిపిస్తుంది. నిజా నిజాలు నాకు తెలియవనుకోండి. అయినా నాకు తెలిసిన విషయాలు దాపరికం లేకుండా చెపుతాను. శంకరానికి ఉద్యోగం వుంది. కొద్దో గొప్పో ఆస్థి కూడా ఉందని అతనే చెబుతాడు. కుర్రాడు బాగానే వున్నాడు - మరిన్నాళ్ళూ పెళ్ళెందుకు కాలేదూ? అంటే, చాలా రోజులుగా

ఆంధ్ర దేశం వదలి వుండడం వల్ల అని అతనే అంటాడు. సరే ఒప్పుకుందాం. మీరు గమనించారో లేదో! నాకు కట్నం పట్టింపులు లేదంటాడు."

"అవును నాతోనూ చెప్పాడు."

"చెప్పాడు గదా! వెధవది ఈ రోజుల్లో గుడ్డి కుక్కకు కూడ పదివేలు, పదిహేను వేలు, లాంఛనాలు, అదనీ యిదనీ ప్రాణం తీస్తున్నారే! మరి ఇతగాడేమిటీ? ఏమీ వొద్దు! పెళ్ళయితే చాలు అన్నట్లుంటాడు?"

బ్రహ్మానందం చెప్పడం, ఆపి సీతారామయ్య ముఖ కవళికలు గమనించాడు- తను చెప్పేది నమ్ముతున్నాడా లేదాన్నట్లు.

సీతారామయ్యకు బ్రహ్మానందం అన్నీ విడమరచి చెబుతుంటే, చింతపండుతో తోమగా, పాత నాణేనికి అంకెలు, అక్షరాలు కనపడినట్లు శంకరం వ్యక్తిత్వం అవగతం కాసాగింది.

"అస్సలు, 'ఆ గేదె మంచిదైతే, ఆ వూళ్ళోనే కొనేవాళ్ళు' అన్నది సామెత. నిజంగా శంకరం చెప్పేవన్నీ నిజం అనుకుంటే, ఈపాటికి ఆడపిల్లల తండ్రులు ఎగరేసుకు పోరు టండీ. అంతదాకా ఎందుకూ - మా చెల్లెలే వుంది. బి.ఏ. ప్యాసయింది. గుట్టుచప్పుడు కాకుండా, శంకరానికిచ్చి చేయనా!"

సీతారామయ్యకు, ఆ మాటా నిజమే అనిపించింది.

"నేనంటే సంసారం పెద్దది. కట్నాలు కానుకలు ఇచ్చుకోలేను. మీకేంటండీ పదిహేను వేలు ఇచ్చుకోగలరు. పైగా ఆఖరి పిల్లంటున్నారు. నన్ను సలహా అడిగితే, తొందరపడటం మంచిది కాదూ అంటాను!" అన్నాడు బ్రహ్మానందం పాలు చిలికి వెన్న తీసినట్లు.

అయితే సీతారామయ్యకు శంక తీరలేదు.

"మరి అతని పూర్తి వివరాలు తెలిసే మార్గమేదీ?"

బ్రహ్మానందం శ్రీకృష్ణపరమాత్మలా నవ్వి, "మేష్టారూ, అందరూ ఆవలిస్తే పేగులు లెక్కపెడతారు. నేను ఎదుట మనిషి క్షణం నిలబడితే చాలు ఎక్సరే తీసినట్లు పూర్వాపరాలు చెప్పగలను. మా మిత్రులకు ఉత్తరాలు వ్రాశాను. ఇవాళో రేపో జవాబు రావాలి! రాగానే మీకు చెబుతాను. సరా!" అన్నాడు.

సీతారామయ్య, బ్రహ్మానందం చేసిన ఉపకారానికి మహదానందపడి, ఇంటికి వెళ్ళి, హిజ్ మాస్టర్స్ వాయిస్‌లా అంతా భార్యకు విన్నవించాడు.

రోజులు గడుస్తున్నాయి. శంకరం వ్యవహారం తేలేదాకా, సీతారామయ్య మరో సంబంధం గురించి వాకబు చెయ్యదల్చుకోలేదు.

ఓ రోజు బజార్లో, శంకరం కనపడ్డాడు. సీతారామయ్య కొంచెం ఖంగు తిన్నాడు, పలకరించాలా వద్దా అన్న మీమాంసలో వుండగానే, శంకరమే పలుకరించాడు.

"మాష్టారూ బాగున్నారా!"

"ఆ! ఆ!"

"మీరామధ్య మీ అమ్మాయి గురించి వచ్చారు. మళ్ళీ వస్తామన్నారు రాలేదేం?"

సీతారామయ్య గుడ్లు మిటకరించాడు. గుక్క త్రిప్పుకుని, "మా యింటి ఆవిడ పడకేసింది బాబూ! వద్దామనుకుంటున్నా" అని, "మీరు ఏదన్నా సంబంధం సెటిల్ చేసుకుంటున్నారా?" అని వాకబు చేశాడు.

"సంబంధాలు చాలా వస్తున్నాయండీ. కానీ ఏదీ నిర్ణయించుకోలేదు."

"ఎందుకనీ!"

"నాకు నచ్చిన సంబంధాలు కొన్ని వున్నాయి. ఎందుకో వాళ్ళు మళ్ళీ కనపడడం లేదు మీలాగానే. నాకంతగా నచ్చని వాళ్ళు తిరిగి పోతున్నారు!"

ఆ సాయంత్రం సీతారామయ్య పరుగెత్తికెళ్ళి బ్రహ్మానందానికి, శంకరం కల్సిన విషయం, తమ మధ్య జరిగిన చర్చల సారాంశం చెప్పాడు.

బ్రహ్మానందం, ముక్కాలిపీట మీద బాసీపెట్లు వేసుకుని, చిరునవ్వు నవ్వుతూ, "నాకు తెలుసు మాష్టారూ! వాడు అమాయకుడిలా మొహం పెట్టి, సంప్రదాయం, గౌరవం కల కుటుంబాల ఇంటి అల్లుడిగా అవ్వాలని తాపత్రయపడుతున్నాడు. వాడివల్ల కాని పని అది. ఏ తలమాసిన వెధవా వాడి మాయలకు మోసపోడు" అని చెప్పాడు.

సీతారామయ్య, భార్యకు ఈ విషయాలన్నీ దాచక చెప్పాడు. వాళ్లిద్దరికీ, కూతురుపెళ్ళి కన్నా, ఈ శంకరం వ్యవహారం కాశీ మజిలీ కథ లాగా క్రొత్త మలుపులు తిరుగుతూ ఆసక్తికరంగా వుంది.

ఆ తర్వాత బ్రహ్మానందం మరికొన్ని క్రొత్త విషయాలు చెప్పాడు.

"శంకరానికి ఇదివరకే పెళ్ళయిందిటండీ! ఆ పిల్లకూ, వీడికీ సరిపడక, ఆ పిల్ల తాలూకు వాళ్ళు తన్నడానికి వస్తే, పారిపోయి చావు తప్పి కన్ను లొట్టబోయి యిక్కడకు తగులబడ్డాడట - భ్రష్టుడు. అమ్మమ్మ! వాడి ముహం చూశారా ఎప్పుడన్నా నింపాదిగా, గండు చీమలు తిన్న బెల్లం గడ్డలా వుంటుంది."

సీతారామయ్య 'సంబంధం తప్పిపోయింది. చాలు' అనుకున్నాడు.

ఆ తర్వాత కొన్నాళ్ళకు సీతారామయ్య, మహాలక్ష్మి గుళ్ళో పురాణం వింటానికి వెళ్ళారు. అదిగో అక్కడ శంకరం కనపడి పలకరించాడు.

"నమస్కారం మాష్టారు!... ఈ మధ్య నా పెళ్ళయింది. ఇదిగో ఈవిడ వసుంధర - మా ఆవిడ" అని భార్యను పరిచయం చేశాడు.

సీతారామయ్యకు కుతూహలం కలిగింది - "అత్తగారిది ఏ వూరూ?" అనడిగాడు.

"ఈ ఊరేనండి! బ్రహ్మానందం అని మా ఆఫీసులో, నా కొలీగ్ - అతని చెల్లెలు."

సీతారామయ్య, 'అమ్మనీయమ్మ! ఎంత కుట్ర జరిగిందీ!' అనుకున్నాడు మనసులో! ఆ మాటే పైకన్నాడు.

మహాలక్ష్మి భర్తను విచిత్రంగా చూసింది. ♦